# నాణ్యమైన విద్య అందించాలి..

**నూతన ఉపాధ్యాయులకు నియామకపత్రాల అందజేత**



నియామక పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 15 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ఇటీవల 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన 278 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లను కేటాయించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఆందోళన




నిరసన తెలుపుతున్న కళాశాలల యాజమాన్యాలు

# డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ధర్నా

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 15 : నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం టీపీడీఎంఏ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మూడేండ్లుగా పెం డింగ్‌లో ఉన్నాయని, కళాశాలలపై ఆర్థిక భారం మోస్తూ విద్యార్థుల వద్ద ఫీజులు తీసుకోకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేసే వరకు కళాశాలలను తెరువబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సాయిలు, అఖిలేశ్ కుమార్, వెంకటేశ్, విఠల్ రావు, బద్రి ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## రెండో రోజూ నిరవధిక బంద్

కుభీర్, అక్టోబర్ 15 : కుభీర్‌లోని వివేకానంద, తపస్వి డిగ్రీ కళాశాలకు టీపీడీఎంఏ ఆధ్వర్యంలో రెండో రోజైన మంగళవారం తాళం వేసి నిరవధిక బంద్ పాటించారు. కళాశాల గేటు ఎదుట నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సట్ల రవి, సంధ్యారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డీఎస్సీ కౌన్సెలింగ్.. గందరగోళం

**అక్రమాలు జరిగాయంటూ ఉపాధ్యాయ సంఘాల ఆందోళన**

- అర్హులు ఉద్యోగాలు కోల్పోయారంటూ నిరసన
- డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయింపు
- కౌన్సెలింగ్ నిలిపివేయాలని డిమాండ్



కౌన్సెలింగ్‌కు వచ్చి కార్యాలయం బయట వేచిచూస్తున్న అభ్యర్థులు



డీఈవో ప్రణీతను నిలదీస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆదిలాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ) : జిల్లాలో డీఎస్సీ కౌన్సెలింగ్ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో 324 పోస్టులను నోటిపై చేయగా, 266 పోస్టులకు 1:3 ప్రాతిపాదికన అభ్యర్థులను పిలిచి వారి ధ్రువపత్రాలను పరిశీలించి నియామకాలను చేపట్టారు. ఉద్యోగాలు పొందిన వారికి మంగళవారం ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఉదయం 9 గంటలకు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కాగానే ఉపాధ్యాయ నియామకాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని, కనీస నిబంధనలు పాటించకుండా అర్హులను పక్కన పెట్టి డబ్బులు తీసుకుని అనర్హులకు ఉద్యోగాలు కేటాయించారంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. నియామకాల్లో అర్హులకు అన్యాయం జరిగిందంటూ డీఈవో ప్రణీతను నిలదీశారు. తమ కార్యాలయ ప్రమేయం లేదని, నియామక ప్రక్రియ డైరెక్టర్ కార్యాలయం నుంచి జరిగిందని అధికారి ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. డీఎస్సీ-2024 నియామకాలు ప్రారంభమైనప్పటి నుంచి డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై తాము ఫిర్యాదులు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని, అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని సస్పెండ్ చేయాలంటూ నాయకులు డిమాండ్ చేశారు.

## నిలిచిన కౌన్సెలింగ్ ప్రక్రియ

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం ప్రారంభం కావాల్సి ఉండగా ఉపాధ్యాయ సంఘాల ఆందోళన నేపథ్యంలో నిలిచింది. సాయంత్రం ఐదు గంటల వరకు కూడా కౌన్సెలింగ్ ప్రారంభంకాలేదు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన అభ్యర్థికి ఉద్యోగం రాలేదని, ఎస్జీటీ విభాగంలో 12వ ర్యాంకు అభ్యర్థి కూడా ఉద్యోగానికి ఎంపిక కాలేదని, ఎస్జీటీ అర్హత ఉన్న మరో అభ్యర్థికి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారిని నిలదీశారు. తాము సూచించిన తప్పులను సరిచేసిన తర్వాతనే కౌన్సెలింగ్ నిర్వహించాలని పట్టుపట్టారు.

## ఉపాధ్యాయ సంఘాల నిరసన

ఆదిలాబాద్ డీఎస్సీ కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ మంగళవారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. అర్హులకు న్యాయం చేయాలంటూ డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సంఘాల నాయకులు బయటకుపోవాలని పోలీసులు సూచించినా వినకపోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో పోలీసులు నాయకులను బలవంతంగా గేటు బయటకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఉపాధ్యాయ సంఘాల నాయకులను డీఈవో కార్యాలయంలోనికి పిలిపించుకుని మాట్లాడారు. నష్టపోయిన ముగ్గురు అభ్యర్థులకు కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించారు. ప్రస్తుతం అండర్ టేకింగ్ కల్పించి మూడు రోజుల్లో వారికి ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది.

## టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

ఆదిలాబాద్ జిల్లా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ మంగళవారం డీఈవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ఆందోళన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే ఆందోళనకారులను వన్ టౌన్ పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నం చేయగా వినలేదు. దీంతో అక్కడి నుంచి ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని టూ టౌన్‌కు తీసుకెళ్లారు. టూ టౌన్ ఎదుట పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు గుమిగూడారు. దీంతో టూ టౌన్ ఎదుట ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకున్నది. ఆందోళనకారుల్లో బీజేపీ నాయకులు పాయల్ శరత్(బన్నీ)తోపాటు మరి కొందరిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.





డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నచ్చచెబుతున్న పోలీసులు

### రెండో ర్యాంకు వచ్చినా లిస్టులో పేరు లేదు..



నేను డీఎస్సీ నియామకాల్లో భాగంగా నిర్వహించిన పరీక్షలో జిల్లా స్థాయిలో ఫిజికల్ సైన్స్ విభాగంలో రెండో ర్యాంకు సాధించా. అయినా నాకు ఉద్యోగం రాలేదు. నా తర్వాత ర్యాంకు సాధించిన వారికి ఉద్యోగం వచ్చింది. లిస్టులో నా పేరు ఎందుకు లేదని అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు. జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాకు అన్యాయం జరిగింది.

*- కందేకర్ శివాజీ, డీఎస్సీ అభ్యర్థి*

### ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు..



ఉపాధ్యాయ నియామకాల్లో జిల్లా విద్యాధికారి, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారీతిన వ్యవహరించారు. నియామక ప్రక్రియలో జరుగుతున్న తప్పుల గురించి అధికారులపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. దీంతో పలువురు అభ్యర్థులకు అన్యాయం జరిగింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయం పనితీరు అస్తవ్యస్తంగా మారింది. జరిగిన తప్పులను సరి చేసిన తర్వాతనే కౌన్సెలింగ్ నిర్వహించాలి.

*- నవీన్‌యాదవ్, పీఆర్టీయూ తెలంగాణ, జిల్లా ప్రధాన కార్యదర్శి*

### అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి..



ఉపాధ్యాయ నియామకాల్లో భారీగా అక్రమాలు జరిగాయి. ఇందులో అందరి పాత్ర ఉంది. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో రెండో ర్యాంకు, ఎస్జీటీలో ర్యాంకు సాధించిన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. జిల్లా విద్యాశాఖ అధికారులు అసమర్థత కారణంగా డీఎస్సీ కమిటీ ప్రమేయం లేకుండానే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు ఈ ప్రక్రియ నిర్వహించినట్లు స్పష్టమవుతుంది. నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. తాము సూచించిన పది తప్పులను సవరించిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించాలి.

*- వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి*

# ఆకుపచ్చ బంగారం వెదురు

**తోటలకు రక్షణతోపాటు రైతుకు అదనపు ఆదాయం**

- నిర్మల్ జిల్లాలో 20 ఎకరాల్లో మోడల్ ఫామ్ ఏర్పాటు
- ప్రత్యామ్నాయ పంటగా రైతులకు అవగాహన
- ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ




ముథోల్ మండలంలోని మచ్కల్ సమీపంలోని బాంబూ ఫామ్



బాంబూ ఫామ్‌లో పెరుగుతున్న వెదురు మొక్కలు

నిర్మల్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ) : వెదురు సాగుపై కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. భవిష్యత్‌లో ఆకుపచ్చ బంగారంగా 'వెదురు' విరాజిల్లేలా అప్పటి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. మూడేళ్లలో సహజ వనరులను ఉపయోగించుకుని సాగును ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందించింది. కేరళ రాష్ట్రంలో విజయవంతమైన 'మిషన్ బాంబూ' తరహాలోనే రాష్ట్రంలో కూడా సాగును పెంచేందుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఉద్యానవన శాఖ యాక్షన్ ప్లాన్‌ను కూడా రూపొందించింది. ఇందులో భాగంగానే మూడేళ్ల క్రితం ముథోల్ నియోజకవర్గంలో మోడల్ బాంబూ ఫామ్‌ను ఏర్పాటు చేశారు. 20 ఎకరాల్లో ఈ ఫామ్ ఉండగా.. నాలుగు రకాల మొక్కలను పెంచుతున్నారు. సాగుకు ముందుకొచ్చే రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలను అందజేస్తున్నారు. మూడేళ్ల వరకు ప్రతి మొక్క నిర్వహణ కోసం రూ.120లను అందజేస్తున్నది. రైతులు తమ తోటల హద్దుల్లో ఈ మొక్కలను నాటితే ఈదురుగాలులతోపాటు, అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడుకునే అవకాశం ఉంది. అలాగే అదనపు ఆదాయాన్ని పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

## దీర్ఘకాలిక ప్రయోజనం

ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లోనే పెరుగుతున్న ఈ వెదురును ఇకపై చేలల్లో సాగుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బహిరంగా మార్కెట్‌లో భారీగా డిమాండ్ ఉన్న వెదురును సాగు చేయాలంటే ఎకరానికి రూ.20-25వేల వరకు ఖర్చవుతుంది. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత ఎకరానికి రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. వెదురు మొక్కలను ఒకసారి నాటితే అవి 50 ఏళ్ల వరకు సజీవంగా ఉంటాయి. ఈ పంట సాగు చేయడం ద్వారా రైతులకు దీర్ఘకాలంపాటు ప్రయోజనం చేకూరుతుంది. అంతేకాకుండా ఈ మొక్కలకు చీడపీడల సమస్య కూడా ఉండదు. కేవలం నిప్పు నుంచి మాత్రమే వీటిని రక్షించుకోవాల్సి ఉంటుంది. పెద్దగా నీటి అవసరం లేకుండానే బంజరు భూముల్లో సైతం సాగు చేయవచ్చు. దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా వెదురుకు డిమాండ్ అధికంగా ఉండడం వల్ల ఇది రైతుకు మంచి ఆదాయాన్ని ఇచ్చే పంట అని అధికారులు వెల్లడిస్తున్నారు.

## ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి

ఏళ్లుగా సంప్రదాయ సాగు చేస్తూ వస్తున్న రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించి అధిక ఆదాయాన్ని పొందేలా కేసీఆర్ ప్రభుత్వం ఆధునిక వ్యవసాయానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించింది. మూడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 8 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీడు భూములతోపాటు, పొలం గట్లపై వెదురును సాగు చేయడం ద్వారా అన్నదాతలు అదనపు ఆదాయాన్ని పొందేలా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ మేరకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడం, నిరంతర శిక్షణ ఇవ్వడం, ఫీల్డ్ ట్రిప్‌లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నది. ముఖ్యంగా ఉద్యానవన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ఇతర రకాల ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

## 20 ఎకరాల్లో వెదురు మోడల్ ఫామ్

ముథోల్ నియోజకవర్గంలో వెదురు మోడల్ ఫామ్‌ను 20 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. దాదాపు మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఫామ్‌లో నాలుగు రకాల వెదురు మొక్కలను సాగు చేస్తున్నారు. ఇందులో బాంబూజా తుల్జా రకం, బాంబూజా బాల్కోవా, డెండ్రో కళామస్, లాటరీ ఫోరస్ రకాలు ఉన్నాయి. కాగా ఇక్కడ వెదురు నర్సరీని ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు నర్సరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. దీంతో మొక్కలు కావాలని రైతులు కోరినప్పుడు ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నారు. ఖమ్మం, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో వెదురు నర్సరీలు ఉన్నాయి. అయితే స్థానికంగానే నర్సరీ ఏర్పాటు చేస్తే రైతులు వెదురు సాగుకు ముందుకొచ్చే అవకాశం ఉంది.

## పెరగనున్న ఉపాధి అవకాశాలు

నేషనల్ బాంబూ మిషన్ కింద దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటైన కార్పొరేషన్‌లు, సంస్థలు వెదురు ఉత్పత్తికి తోడ్పాటును అందిస్తున్నాయి. కేరళ, అగర్తల, త్రిపుర రాష్ట్రాల్లో ఇప్పటికే వెదురుతో అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. అగర్‌బత్తి తయారీలో కూడా వెదురును ఎక్కువగా వినియోగిస్తున్నారు. అలాగే గృహ నిర్మాణ రంగం, పలు ఉపకరణాల తయారీలో వెదురును విరివిగా వాడుతున్నారు. తెలంగాణలో ప్రత్యేకంగా ఓ కులానికి చెందిన వారు వారసత్వంగా వెదురుతో వస్తువులను తయారు చేసి విక్రయిస్తుంటారు. అయితే ఇటీవలి కాలంలో వెదురు లభ్యత తగ్గిపోవడంతో వారు ఇతర వృత్తుల్లోకి వెళ్లే పరిస్థితులు నెలకున్నాయి. వెదురు సాగును ప్రోత్సహిస్తే మిగతా వారికైనా ఉపాధి లభించే అవకాశం ఉన్నది.

### అవగాహన కల్పిస్తున్నాం..

వెదురు పెంపకంపై రైతులకు మండలాలవారీగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ముథోల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ ఫామ్‌లో పలు రకాల వెదురు మొక్కలు పెరుగుతున్నాయి. తక్కువ ఖర్చుతో సాగయ్యే వెదురు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు. పొలం గట్లపై వెదురు మొక్కలను నాటడం ద్వారా అవి గుబురుగా పెరిగి చేలకు రక్షణ కవచంలా ఉంటాయి. దీంతోపాటు బొంగు కటింగ్ ద్వారా అదనపు ఆదాయం లభిస్తుంది. సాగు మెలకువలతోపాటు మార్కెటింగ్, వివిధ రకాల ఉత్పత్తుల తయారీపై రైతులకు శిక్షణ అందిస్తాం.

*- వెంకట రమణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, నిర్మల్.*

# ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలి

**ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర ప్రారంభం**

ఎదులాపురం, అక్టోబర్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు తన మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం నుంచి ప్రారంభమైంది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం అక్కడే ఉన్న అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి సమర్పించారు. దామోదర్ జాతీయ జెండా ఊపి పాదయాత్రను సాగనంపారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ధర్నాలు, రాస్తారోకో, జైళ్లకు కూడా వెళ్లామన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని ఆరోపించారు. ఈ పాదయాత్ర ఈనెల 29న ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సామల ప్రశాంత్, నాయకులు సూజత్ అలీ, తుడుం రాములు, నరేందర్, శ్రీధర్, అంజనేయులు, రఫీక్, దత్తు పాల్గొన్నారు.



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న దామోదర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నరెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

ఎదులాపురం, అక్టోబర్ 15 : మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. నశముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని టీచర్స్ కాలనీలోని డ్రగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సంక్షేమ అధికారిణి సబిత హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వాడడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని, కుటుంబ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. నశముక్త్ భారత్ అభియాన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం మాదక ద్రవ్యాల వ్యతిరేకం గురించి ప్రతిజ్ఞ చేశారు. నశముక్త్ భారత్ అభియాన్ తరపున కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్ శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

# పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 15 : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా పరిధిలో ఫొటోగ్రాఫర్స్, ఫొటోగ్రఫీ, వీడియో గ్రాఫర్లకు షార్ట్ ఫిల్మ్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈనెల 21న వారోత్సవాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా ఇటీవల కాలంలో తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల షార్ట్ ఫిల్మ్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 21వ తేదీ లోపు జిల్లా పోలీసు కార్యాలయంలో ఐటీ కోర్ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే జ్యోతిమని ఐటీ కోర్ ఎస్సై 8712577719ను సంప్రదించాలన్నారు. అలాగే తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశంపై 20లోపే వ్యాసాలను nirmalitct@gmail.com కు మెయిల్ చేయాలన్నారు.